క్లుప్తంగా

కొనసాగుతున్న మరమ్మతు పనులు



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని పాఠశాలలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. కిటికీలు, తలుపులు, పాఠశాల పైకప్పు పెచ్చులూడడం, మూత్రశాలల మరమ్మతు పనులు చేస్తున్నారు. వారం రోజుల్లో ఆయా పాఠశాలలోని మరమ్మతు పనులు పూర్తి అవుతాయని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఇంటింటి మిషన్ భగీరథ నల్లాల సర్వే



తాడూరు: మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం సెలవు రోజు అయినప్పటికి పంచాయతీ సిబ్బంది ఇంటింటా తిరిగి మిషన్ భగీరథ నల్లాల సర్వేను కొనసాగిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ ఆధ్వర్యంలో వార్డుల వారీగా ఇంటింటా తిరుగుతూ నల్లాలు ఏ సమయంలో వస్తున్నాయి, సరిపడా నీరు వస్తుందా లేదా అని యజమానులను అడిగి తెలుసుకున్నారు. వార్డులలో నీటి సమస్య లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

కోడేరు: మండలంలో ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కురుమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రోడ్లపై, ఖాళీ స్థలంలో మద్యం తాగితే ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుటామని తెలిపారు. వాహనాలు నడిపతే డ్రంకెన్‌డ్రైవ్‌పై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంంంలోని తునికిబండతండాకు చెందిన వద్యావత్ గోపాల్‌నాయక్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ రూ.2.60లక్షల చెక్కును హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేశమల్ల కృష్ణ, ప్రవీణ్‌నాయక్, అనిల్ కుమార్, రాజునాయక్, రాజేష్‌నాయక్, పంతు నాయక్ తదితరులు ఉన్నారు.

మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన దివ్యాంగుడు, టైలర్ గఫార్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితుడిని పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

అచ్చంపేట రూరల్: నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, మరోసారి నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను ఎస్‌ఎఫ్‌యూఐ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలన్నారు. సంస్థ తప్పుల కారణంగా విద్యార్థులను బలి చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యశ్వంత్, శ్రీను, లడ్డు యాదవ్, సోహెల్, ఈశ్వర్, గణేష్, హరిచంద్ర, ఆంజనేయులు, నాగరాజు, అరుణ్, చత్రునాయక్, రామనాథం, మహబూబ్‌అలీ, లక్ష్మణ్, తిరుపతయ్య, సోమ్ల పాల్గొన్నారు.

పాఠశాలలు కొనసాగేనా?

మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలలు
సత్ఫలితాలివ్వని బడిబాట



మూతబడిన బావులకాడి తండా ప్రాథమిక పాఠశాల



తెరిచి ఉంచిన కాంసానిపల్లి తండా పాఠశాల

ఉప్పునుంతల: పాతికేళ్ల కిందట పేద, ధనిక భేదాలు లేకుండ విద్యార్థులందరూ స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేవారు. ఎక్కడో పట్టణాల్లో మినహాయిస్తే ప్రైవేట్ పాఠశాలలు ఉండేవి కావు. కాల క్రమేణా విద్య వ్యాపారంగా మారడం, ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకరావడం, ఇంగ్లీష్ మీడియంపై మక్కువ పెరగడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు ఇష్టపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తే తమను చులకనగా చూస్తారని చాలా మంది భావిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది పూర్తిగా తగ్గిపోవడంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జెడ్పీహెచ్‌ఎస్‌ల స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఓ మాదిరిగా ఉన్నా యూపీఎస్‌లు, పీఎస్‌లలో మాత్రం విద్యార్థుల సంఖ్య పూర్తిగా తక్కువగా ఉంది. ఈ క్రమంలో విద్యార్థులు లేక మండలంలో కొన్ని పాఠశాలలు మూతపడగా మరికొన్ని అదే బాటలో కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం పాఠశాలలు 43 ఉండగా వాటిలో 4 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 7 యూపీఎస్‌లు, 30 పీఎస్‌లతో పాటు ఉప్పునుంతల కేజీబీవీ, వెల్టూరు బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయి. గతేడాది ఆయా పాఠశాలల్లో మొత్తం విద్యార్థులు 2383 మంది ఉన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు బడిబాటలో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నారు.

గతేడాది తొమ్మిది పాఠశాలల మూత..

గతేడాది విద్యార్థులు లేక మండలంలో తొమ్మిది పాఠశాలలు పూర్తిగా మూతపడ్డాయి. వాటిలో రంగంపేట, కాంసానిపల్లి తండా, గుట్టమీది తండా, అయ్యవారిపల్లి తండా, మూస్యతండా, ఫిరట్వానిపల్లి తండా, సీబీ తండా, బావులకాడి తండా, వెల్టూరు తండా పాఠశాలలు ఉన్నాయి. మూతపడిన పాఠశాలల ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రస్తుతం మూతబడిన పాఠశాలలను తెరిచి ఉంచారు. ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారు. గత మూడు రోజుల నుంచి పాఠశాలల్లో విద్యార్థులు ఏమాత్రం చేరనట్లు సమాచారం. ఏకోపాధ్యాయ పాఠశాలలకు తమ పిల్లలను పంపించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది విద్యార్థులు రాకపోతే ఆయా పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉంది. దానికి తోడు ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు ఉండటంతో మూతబడిన పాఠశాలల ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులు లేక పాఠశాలలు ఇదేమాదిరిగా కొనసాగితే ఉపాధ్యాయ పోస్టులు శాశ్వతంగా రద్దయ్యే పరిస్థితి ఉంది. ఒకసారి పాఠశాలను ఎత్తివేస్తే తిరిగి తెచ్చుకోవడం కష్టమని పలువురు ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్నా వారిలో మార్పు కన్పించడలేదు. మారుమూల తండాలు, గ్రామాల నుంచి బస్సుల ద్వార ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను చేరవేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలలకు ఈ పరిస్థితి దాపురించింది.

పాఠశాలలను కాపాడుకుందాం



గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించి పాఠశాలను కాపాడుకోవాలి. గతేడాది మూతబడిన పాఠశాలలను ఈ ఏడాది తెరిచి ఉంచాం. కనీసం ఐదు మంది విద్యారులు ఉంటేనే పాఠశాలను కొనసాగించే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు విద్యార్థులు పాఠశాలల్లో చేరలేదు. ఒక వేళ విద్యార్థులు చేరకపోతే ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపిస్తాం.

– రామారావు, ఇన్‌చార్జ్ ఎంఈఓ, ఉప్పునుంతల

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తులు భక్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద భక్త లక్ష్మీనరసింహ స్వామి ఆరో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సుదర్శన హోమం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, లక్ష్మీనరసింహ స్వామి హవణం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ వైభవంగా కొనసాగింది. పద్మాలయ ఆచార్య ఆధ్వర్యంలో పార్వతీ కల్యాణ మహోత్సవ కావ్యాన్ని హరికథ రూపంలో కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ నెల 17న భక్త లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తునట్లు వ్యవస్థాపక ధర్మకర్త కాశిం శెట్టి విజయలక్ష్మి తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థులకు బెల్టులను అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొట్రలో కరాటే విద్యార్థులకు బెల్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కరాటే మాస్టర్ కుమార్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వేసవిలో కరాటేలో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. కరాటేతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్ రావు, కుమార్, నాగరాజు, శివరాణి, ఆంజనేయులు, వెంకటయ్య, సహదేవ్, సంతీష్ తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పెంట్లవెల్లి: చిన్నారిపై లైంగికదాడి, హత్యను ఖండిస్తూ గ్రంథాలయం దగ్గర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, రోజా, చిట్టెమ్మ, గోవిందు, రాజులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీఓ భవనం



పెచ్చులూడిన ఎంపీడీఓ పైకప్పు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పై కప్పు సిమెంట్ పెచ్చులూడిపడి, సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. 20 సంవత్సరాల కిందట నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం నాణ్యతగా పనులు చేపట్టకపోవడంతో కార్యాలయంలోని అన్ని గదులు శిథిలావస్థకు చేరాయి. గోడలు కూడ కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలో పెచ్చులు ఊడిపోయిన గదులకు సిమెంట్ వేసి తాత్కాలికంగా మరమ్మతు చేపట్టినా ఉపయోగం లేదు. కార్యాలయంలో పనిచేసే అధికారులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రతిపాదనలు పంపించాం

ఎంపీడీఓ కార్యాలయం కొత్త భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధుల మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– నాగేందర్, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులతో శ్రీవాణి విద్యానిలయ పూర్వ విద్యార్థులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీవాణి విద్యా నిలయం 1998–99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సత్కరించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు క్రీడా పోటీలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలన్నారు. ప్రదీప్‌కుమార్, పాలమూరు రాజేష్, సునీల్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని దండోరా జిల్లా నాయకులు పుట్టపాగు రామ్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కుడికిళ్లలో ఆయన దండోరా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా కేంద్రంలో ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం వర్షాకాల సమాశాలలో బిల్లు పెట్టి ఎస్సీలలో ఉన్న 59 కులాలకు న్యాయం చేయాలన్నారు. గత 30 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిగ దాని ఉపకులాలలకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని వర్గీకరించాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో భర్తీ చేస్తున్న ఉద్యోగ నియామకాలు ఎస్సీవర్గీకరణ అయ్యేంత వరకు ఆపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో దండోరా మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వర్షం కోసం ఎదురుచూపులు



మేడిపూర్‌లో స్పింక్లర్లు ఏర్పాటు చేసిన రైతులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో వరుసగా కురిసిన వర్షాలకు రైతులు ఉత్సాహంతో చదును చేసి పొలాలో విత్తనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం మొలకెత్తిన మొలకలను కాపాడుకోవడం కోసం రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వర్షం కోసం ఎదురు చూస్తూ నీటి వసతి ఉన్న రైతులు మొలకొత్తిన మొలకలను కాపాడుకోవడం కోసం స్పింక్లర్‌లను ఏర్పాటు చేసుకొంటున్నారు. వారం రోజుల నుంచి ఎండలు విపరీతం కావడం వల్ల మొలకలు ఎండిపోతాయేమోనన్న భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 18308 ఎకరాలలో పత్తి, 8710 ఎకరాలలో వరి, 307 ఎకరాలలో కంది, 1277 ఎకరాలలో మొక్కజొన్న వంటి పంటలను రైతులు సాగు చేసుకున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి



బోర్ మోటార్ ప్రారంభిస్తున్న నాయకులు

చారకొండ: మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని గైరాన్‌తండా పంచాయతీ పరిధిలోని వంకరాయితండాల్లో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల కిందట బోరు డ్రిల్లింగ్ చేయించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోరు మోటర్‌ను బిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, నాయకులు మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, సందీప్ రెడ్డి, హరి, భాస్కర్, పర్వతాలు, కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పోటెత్తిన భక్తులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలోని జమ్ములమ్మ గుడికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కోళ్లు, పొట్టేళ్ల బలిఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయ విశిష్టతను మేనుగొండ వంశానికి చెందిన ఆలయ పూజారులు భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బస్సులు నడపండి

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లికి బీటీ రోడ్డు ఉన్నా ఆర్టీసీ అధికారులు బస్సులను రెగ్యులర్‌గా నడపడంలేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి గ్రామం 13.5 కి.మీ.దూరంలో ఉంది. మండల కేంద్రానికి వెళ్లాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పాటు ఈ గ్రామానికి చెందిన చాలా మంది వ్యాపార నిమిత్తం ఎక్కువగా పెబ్బేర్‌కు వెళ్తుంటారు. రెగ్యూలర్‌గా బస్సు నడపాలని ఇటూ ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

పుస్తకాల కొరత

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన పాఠ్యపుస్తకాలల్లో ఇంగ్లిష్, హిందీ పుస్తకాలు మినహా మిగతా అన్ని వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి మొత్తం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు కలిపి 35వేలకు గాను 6వ తరగతి ఇంగ్లిష్, 9, 10వ తరగతి హిందీ పుస్తకాలు మినహా మిగతా అన్ని పుస్తకాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వచ్చిన పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. మిగతా పుస్తకాలు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో భక్తులకు తప్పని తిప్పలు



పెద్దకొత్తపల్లిలో నిలిచిన వాహనాలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లే వాహనాలతో పెద్దకొత్తపల్లి బస్టాండ్ కూడలిలో రద్దీ కనిపించింది. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. గంటల తరబడి రోడ్లపైనే వాహనాలు నిలిపివేశారు. ఆదివారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. మృగశిర కార్తీ చివరి వారం కావడంతో తెల్లవారుజామున 5 గంటల నుంచే ప్రైవేటు వాహనాలు తరలివెళ్లారు. భక్తులు బస్టాండ్ కూడలిలో వాహనాలు నిలిపి భక్తులు, కోళ్లు, కొబ్బరికాయలు, పూలు, కిరాణం సామానులు కొనుగోలు చేసేందుకు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనదారులు కూడ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో వాహనాలు నిలుపుకొని వేచిఉండే పరిస్థితి దాపురించింది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే నాగర్‌కర్నూల్ వచ్చే మైసమ్మ దగ్గరకు వెళ్లే వాహనాలను ముష్టిపల్లి స్టేజీ వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ముష్టిపల్లి, మర్రికల్, పెద్దకార్పాముల మీదుగా నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. కొల్లాపూర్ నుంచి వచ్చే ప్రైవేటు ఆర్టీసీ బస్సులను సాతాపూర్ గ్రామం మీదుగా మారేడుమాన్‌దిన్నె క్రాస్‌రోడ్డు యాపట్ల, జగన్నాథపూర్, చిన్నకొత్తపల్లి మీదుగా మైసమ్మ జాతరకు వాహనాలు పంపిసస్తే పెద్దకొత్తపల్లిలో ట్రాఫిక్ సమస్య ఉండదు. అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. క్యూ లైన్‌లో నిల్చొని అమ్మవారిని దర్శించుకున్నారు. మైసమ్మ దేవతను 12 వేల మంది భక్తులు దర్శించుకునట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మన్ననూర్: ప్రమాదవ శాత్తు మృతి చెందిన బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం పరామర్శించారు. శనివారం రాత్రి శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పిట్టల పర్వతాలు (63) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మన్ననూర్‌లోని మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రజా ప్రతినిధులు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పశువుల అక్రమ తరలింపుపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారిలోని లత్తీపూర్ శివారులో ఉన్న చెక్‌పోస్టు వద్ద ఆదివారం వ్యాన్‌లో పశువులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వాటిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అచ్చంపేట సీఐ రవీందర్ స్టేషన్‌కు వచ్చి పశువుల తరలింపుపై విచారణ చేశారు. పెనిమిళ్లకు చెందిన ఎండీ నూరుపాషా మినీ వ్యాన్‌లో ఒక ఆవు, దూడ, ఎద్దును తరలిస్తూ పొంతన లేని సమధానం చెప్పడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుజ్ఞానం తెలిపారు. పశువులను వట్టెం గోశాలకు తరలిస్తున్నామని ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బల్మూర్: మండల కేంద్రంలోని నమాజ్‌గడ్డ సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇదే దారిగుండా ఆంజనేయస్వామి దేవాలయానికి భక్తులు వెళ్తుంటారు. అదే విధంగా అచ్చంపేట–లింగాల వైపు నుంచి వచ్చే వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. గత ఐదేళ్లలో ట్రాన్స్‌ఫార్మర్ ఎదుట ఉన్న రోడ్డు మార్గంలో వాహనాలు ఢీకొని ముగ్గురు మృతి చెందిగా పలువురు గాయాలైన ఘటనలు ఉన్నాయి. అయిన విద్యుత్, ఆర్‌అండ్‌బీ ఏమాత్రం పట్టించుకోక పోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొక చోటికి మార్చాలని కోరుతున్నారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన జొల్లు అఖిల్ ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాలలో 645 మార్కులు సాధించాడు. పలువురు పార్టీల నాయకులు, పూర్వ విద్యార్థులు ఆయనను సన్మానించి పేద విద్యార్థులకు వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీరయ్యయాదవ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.